# దక్కింది గొడుగు

అప్పటికే చీకటి పడింది.. సీతారామయ్య బజారుపనులు చక్కబెట్టుకుంటూ, తమ వీధి ముందుకు వచ్చేసరికే, హఠాత్తుగా 'టప టప' మని పది చినుకులుపడి, అతడి బట్టల్ని కొద్దిగా తడిపి పారేశాయి! వేసవికాలంలో టపటప చినుకులు ఒక్కోసారి పడి ఆగిపోవటంవున్నదే అయినా, అతగాడు. "ఛస్. గొడుగుతెచ్చుకుంటే, ఇలా బట్టలు తడిసేవి కావుగదా! పదిరూపాయలు వెచ్చించి ప్రత్యేకంగా కొన్న ఆ గొడుగు-ఇంతవరకూ తిన్నగా ఉపయోగించుకొన్నది లేదు అవసరానికది ఉపయోగపడనప్పుడు —— అది నిజంగా అనవసరమే-" అనుకొన్నాడు!

పైవిధంగా తలబోసిన సీతారామయ్య, గురించీ అతడు కొనుక్కున్న పది రూపాయల గొడుగు గురించీ-కొద్ది వ్రాయటం అవసరం

యవ్వనంలో వున్న సీతారామయ్య స్వతహాగా పిసినిగొట్టుకాదు. అయితే కాలికి జోడూ, పైకి గొడుగూ యిత్యాదులకు పెద్దగా రూపాయలు వెచ్చించటం, అతడికి స్వతహాగా యిష్టంలేవు అందువల్లనే నిన్న మొన్నటివరకూ, అతడికా రెండువస్తువులూ సమకూడ్డంగూడా జరగలేదు!

గవర్నమెంటు గుమాస్తాగా సీతారామయ్య-నెలకు పది పదులదాకా సంపాదించుతున్నా, ఈలాంటి వస్తువులకు డబ్బు ఖర్చుచేయటం అనవసరమనే తలంపు అతడికి పుట్టుకనుంచీ వుంది. ఏమయితేనేం... కాలం, ఖర్మం కలసిరావటంవల్ల, అతడు పదిరూపాయలు వెచ్చించి ఒక గొడుగు కొన్నాడు! అతడది కొనటం కూడా ఒక కథే!

'వదిన' సినిమా ఆవూళ్ళో విడుదలయింది! ఆరోజు శనివారం అవటంవల్లా - సీతారామయ్య కారోజు సెలవుదినం అవటంవల్లా- ఆచిత్రం మ్యాటినీషోతో ప్రారంభమవుతూండటంవల్లా-సినిమాకు అతడు బయలుదేరటానికి ఎటువంటి ఆటంకమూ లేకపోయింది! సీతారామయ్య మూడు గంటలకు మొదలెట్టబోయే కొత్త సినిమా చూడ్డానికి ఇంటి దగ్గర రెండు గంటలకే బయలుదేరాడు! థియేటరు వూరికి మైలున్నర దూరంలో వుండటంవల్లా-సీతారామయ్య నడిచే అక్కడకు వెళ్ళాలనుకొంటున్నాడు - ఆలా ఒక గంట ముందు బయలుదేరటం అవసరమే!

అయితే, సీతారామయ్య, వంతెన దగ్గర కొచ్చేసరికి-పాతస్నేహితుడు గోపాలం కనిపించాడు. వాడు ప్రస్తుతం భిలాసపూర్ లో రైలు గార్డుక్రింద పనిచేస్తున్నాట్ట!

గోపాలంతో మాట్లాడుతూ అప్రక్కనే వున్న కాఫీహోటల్లో కాఫీలు సేవించి, అతడ్ని వదిలించుకొనేసరికి ఇంచుమించుగా రెండున్నరగంట లయింది! మరో అరగంట వ్యవధే సీతారామయ్యకుంది!

సీతారామయ్య ఇంకా వెళ్ళవలసిన దూరం...ఇంచు మించుగా మైలువుంది .. అతను హడావుడిగా నడుస్తూ బజారు దగ్గర కొచ్చేసరికి —అంతవరకూ నిర్మలంగావున్న ఆకాశం, కాంతితో వెలుగుతున్న సూర్యుడూ మాయమయ్యాడు! మేఘాలు వురమటం, పెద్దలెక్కన చినుకులు పడటం- ఒకదాని తరువాత, మరొకటిగా-హఠాత్తుగా జరిగిపోయాయి!

"కొంప మునిగింది...ఇప్పుడెలాగ" —— అనుకుంటూ సీతారామయ్య, ఎదురుగా వున్న నేషనల్ ఫాన్సీ ఎంపోరియం వంక ఒక మారుచూచి, వడిగా పరుగెత్తి, అక్కడికి చేరుకొన్నాడు!

ఎంపోరియం—ప్రొప్రయిటరు అప్పారావు సీతారామయ్యకు స్నేహితుడే! అతడు, సీతారామయ్యను, యోగక్షేమం చేసి, అప్పుడే గొడుగు కావాలంటూ వచ్చిన మనుషులకు-తీసిచూపి, ఏమిటో మాట్లాడుతున్నాడు సీతారామయ్య దృష్టి కూడా వాటి వయిపుకు వడిచింది

అప్పారావు అన్నాడు "ఇది ప్లాస్టిక్ హేండిల్ తో-అలిఘర్ ఇనుప తీగలతో— నల్లసిల్కు ప్రత్యేక పనివాడితనమైన గుడ్డతో తయారైన గొడుగండీ!" కొలంబియా కాదు-బల్బుమార్కు కాగు ఏకంపెనీ గొడుగులూ దీనికిపోటీగా నిలవలేవు కావాలంటే మాత్రం - లోపలకు నీటిచుక్క ప్రవేశిస్తుందేమిటె? చాలా కట్టుదిట్టం అయిన ఛత్రం"-అని.

'శివరామ'

గొడుగును పరిశీలించుతున్న పెద్దలకు అప్పారావు మాటలు నచ్చాయి వాళ్ళు ధర అడిగారు

అప్పారావు గొడుగు ప్రత్యేకతలగురించి మరోమారు చెప్పి, "ఇన్ని లక్షణాలు కలిగి వుండి కూడా ఈగొడుగు ధర పదిరూపాయలే"-అన్నాడు!

ధర అవతల మనుషులకు సబబుగా తోచటంవల్ల కాబోలు, నచ్చిన గొడుగును తీసికొని, డబ్బుయిచ్చి నిష్క్రమించారు!

ఏకధారగా, కురుస్తున్న వాన వంక, అయోమయంగా సీతారామయ్య ఒకసారూ ఎంపోరియంలో గోడ గడియారం వంక మరోమారు చూసి. అమ్మో...రెండూ నలభై"-అంటూంటే వర్తకం చేసుకొనే అప్పారావు మామూలు ధోరణిలో: ఏభై గొడుగులకు ఆర్డరిస్తే - మరో అరడజను మాత్రమే మిగిలాయండి! ఏమయినా యిది గొడుగుల సీజన్ కాదండీ! న్యాయంగా యీగొడుగు పదిరూపాయల విలువ చేస్తుంది" అన్నాడు.

సీతారామయ్యకా మాటలు పెద్దగా రుచించలేదు. అతడేలాగో "అది సరేలేవోయ్! నేసినీమాకు బయలుదేరాను. దార్లో యిలా వానవచ్చి పడింది ఇంక యిరవై నిముషాలే టయింవుంది. ఏదయినా పాతగొడుగువుంటే దయయుంచి యిద్దూ... తిరిగి వచ్చేటప్పుడు యిస్తాను-"అంటూంటే,

అప్పారావు, వ్యాపార ధోరణిలో: మీరు పాత గొడుగు తీసుకు వెళ్ళటం యేమిటండీ? కొత్తదే తీసుకెళ్ళండి! తిరిగి ఇప్పుడప్పుడే ఇటువంటవి రావు"—అన్నాడు కొత్త గొడుగుల్లోంచి, ఒకటి ఎన్నికచేసి, తెచ్చి ఇవ్వబోతూ!

సీతారామయ్యకు ప్రాణం పోయినంత పనయింది; కొత్తగొడుగు కొనటమా! తీసుకోకుంటే—అప్పారావు తన లోభిత్వానికి నవ్వడుకదా? ఏలాగో అతడు వనుకొడుతూ, "పుచ్చుకోవచ్చుగానీ దగ్గర డబ్బు లేవోయ్"—అంటూ తప్పించుకోబోయాడు!

—ఆవిధంగా అంటే గొడుగు కొనటం తప్పకుండా తప్పిపోతుందనుకున్నాడు సీతా

# ★ దక్కిందిగొడుగు ★

రామయ్య; కానీ, పరిచయం- వున్న ఒక గవర్నమెంటు గుమాస్తాను—అప్పారావు లాంటి బిజినెస్ మనిషి తేలిగా వదిలేస్తాడా?

"మీ దగ్గర డబ్బు యెక్కడికిపోతుంది! మీ అభిమానం నామీదవుంటే అంతేచాలు! మీకు వీలయినప్పుడే—రెండు నెలల లోగా డబ్బివ్వండి"—అంటూ అప్పారావు సీతారామయ్య చేతిలో—తాను ఎన్నిన గొడుగును వుంచాడు!

"సీతారామయ్య మరి తప్పించుకో లేకపోయాడు! పైగా టయిం మరో అరునిముషాలు ముందుకు నడిచింది "సరే అయితే గొడుగు మంచిదేగదా? నా పేరు నోటు చేసుకో," అంటూ—ఒకమారు, దాన్ని హుందావుడిగా పరిశీలన చేసి, తృప్తిచెంది, గొడుగు వేసుకొని హుందావుడిగా థియేటరు వైపు నడక సాగించాడు!

ఏమనుకుంటే ఏం లాభం? రెండుఫర్లాంగులు దూరం సీతారామయ్య—తిన్నగా నడిచాడో లేదో—వాన తుప్పరగానూ, తుప్పరపాడి గాలిగానూ, కొద్దినిముషాలోనె మారిపోయాయి! సీతారామయ్య సినీమా హాలు దగ్గర కొచ్చేసరికి-అంతవరకూ చాటున దాక్కొన్న సూర్యుడుగూడా బయటకు వచ్చి ప్రకాశించటం ప్రారంభించాడు!

ఇదంతా చూసి—సీతారామయ్య కృంగిపోయాడు! కొద్ది నిముషాల వుపయోగం కోసం—అతడు పదిరూపాయలు (ఇవ్వక పోయినా) చెల్లించవలసి వచ్చింది! కొనేసింతరువాత ఏమనుకుంటే యేంలాభం?

ఏమయితే నేం—సీతారామయ్య సినీమాకు టైంకు అందుకొన్నాడు. అంతే కాదు, కొనటం జరిగిపోయింది గనుక, "వదిన—సినీమాకు బయలుదేరటంవల్ల దాని ధర్మమా అని గొడుగును సంపాదించుకొన్నాను మరి జోడుకూడా యెప్పుడో కొనుక్కోవాలి"—అని బ్రహ్మాండమైన సంతృప్తి వెలడించుకొని థియేటరులోకి నడిచాడతగాడు!

ఇప్పటి కతడు గొడుగుకొని కొన్నిమాసాలయినా- తిన్నగా వుపయోగించుకొన్నది లేదు! అలాంటప్పుడు—సీతారామయ్య అలా సమయం వచ్చినప్పుడు బాధను వెడల గ్రక్కటంలో తప్పేముంది?

* * *

సీతారామయ్య ఇంట్లోకివచ్చాడు. అతడు తన గదిలోకి నేరుగా ప్రవేశించి, గది చీకటిగా వుండటంవల్ల స్విచ్ వేశాడు తడి-పొడిగావున్న చొక్కావిప్పి—'ఫరవాలేదు' అనుకొని వంకెకు తగిలిస్తూంటే—అతడిదృష్టి గొడుగుమీదకు పోయింది! ఆ వంకెకే సీతారామయ్య గొడుగు వ్రేలాడుతూండేది! ప్రస్తుతం అదిమాత్రం అక్కడ లేదు!

చొక్కావిప్పి, వంకెకు తగిల్చిన సీతారామయ్య గదిని—తీక్షణంగా పరిశీలిస్తూంటే అతడి అర్ధాంగి జానకి చెంబూనీళ్ళతో గదిలో ప్రవేశించింది;

"గొడుగేదీ?"—భార్యవైపు సీతారామయ్య తీక్షణంగా చూశాడు!

"అప్పుడే అరావచ్చిందీ, జానకినవ్వింది!

ఈలోగాసీతారామయ్య కాళ్ళుకడుక్కొచ్చాడు!

"ఏం?"

"మా నాన్నగారు తీసుకు వెళ్ళారండీ"

"ఎందుకు తీసుకెళ్ళారూ?—సీతారామయ్య కసిరాడు!

జానకి నవ్వుతూ అంది "ఎందుకండీ ఆలా కసురుకుంటారు? మా నాన్న మావూరి నుంచి ఇక్కడకు వచ్చి రాజమండ్రం వెడదామని 'సైకు షోనుకు" మధ్యాహ్నం బయలుదేరారు

అప్పుడు ఎండ ఎక్కువగా వుంది. అందుకని—స్టేషనుదాకా "ఆమె ఇంకా ఏమో చెప్పబోతూంటే, "నా గొడుగు తీసుకువెళ్ళారన్నమాట" నములాలన్నంత కోపం వచ్చిన సీతారామయ్య ప్రిమింగుతూ అన్నాడు"

"అంత కోపం దేనికండీ?"--జానకి వెక్కిరింపుగా అంది.

"కొనలేక, కొనలేక నేను గొడుగు కొనుక్కున్నాను ఎక్కడపారేసుకుంటానో అని—నేదాన్ని తిన్నగా ఉపయోగించుకోలేకుండాను! ఈరోజు కీరోజు—నిక్షేపంలాంటి గొడుగువుండగా—వానలో తడిసి రావలసి వచ్చింది మీ నాన్నగారు మాత్రం—మహానుభావుడిలాగ. దాన్ని తీసుకు వెళ్ళారు ఎక్కడవస్తువును అక్కడే మరచి పోయే తత్వం ఆయనది! ఆయన ఎక్కడయినా దాన్ని పారవేస్తే, నాగతేంకానూ? ఎంతయినా మామగారు, ఆయన ఎక్కడో గొడుగు పారేస్తాడు, అంతవరకూ ఖాయం; ఆయన్ను నాగొడుగు నాకు ఇవ్వమని అడగ్గలనా?"

జానకికి రోషం వచ్చింది ఆమె, ఆపరిస్థితిలోనే నవ్వుతూ; గుమ్మడి కాయ దొంగ అంటే, వెనకటి కెవరో బుజాలు తడుముకున్నారట. అలా వున్నాయి మీ మాటలు. మా నాన్న మతిస్థిమితంలేని వాడని మీరా విసంగా అనుకుంటున్నారు! కానీ మీరన్నంత మరుపుమనిషి కాదాయన; అందుకేనూ, అది అల్లుడు గారి గొడుగు! మీరు దెప్పిపొడుస్తారని—ఆయనకూ తెలుసు; అందువల్ల మీ గొడుగు విషయంలో ఆయన తగినంత శ్రద్ధతోనే వుంటారు లెండి"

సీతారామయ్య, ఏడ్వ లేక నవ్వుతూ అన్నాడు 'అయితే—నా గొడుగు భవిష్యత్తు గురించి నీ అభిప్రాయం ఏమిటే?"

"మీగొడుగుకు భవిష్యత్తేమిటి? అది జాగ్రత్తగా ఇంటికి వస్తుంది."

"నాకు నమ్మకం లేదు రైల్లో ప్రయాణం చేస్తూ—కంపార్టుమెంటు బల్లమీద పర్సు మరచిపోయిన మహానుభావుడాయన—"

జానకి మరి ఓర్పు వహించ లేకపోయింది "అనవసరంగా ఆయన్ని అనకండి మీ గొడుగు ఎక్కడికీ పోలేదు. ఊళ్ళోనే వుంది"

సీతారామయ్య బ్రతికొననుకొని, "అదేమిటి" - అంటూ భార్యవైపు చూశాడు

"రాజమండ్రం వెళ్ళదామనుకొన్న మా నాన్నగారు వెళ్లలేదు!"

"అయితే మరి గొడుగేదీ?"

"స్టేషనుదాకా వెళ్ళేసరికి - ఎండ తగ్గుముఖం పెట్టిందట రాజమండ్రం బండిలో వెళ్ళేసరికి యెలాగా సాయంకాలం అయిదు గంటలవుతుంది. ఎండ ఏలాగూ తగ్గిపోతుంది - అందువల్ల మరి గొడుగనవసరం పొరపాటున అది యెక్కడయినా పడేస్తే పడవేయమన్నా కూడా! అందులోనూ - మా అల్లుడు అందరల్లుళ్ళవంటివాడూ కాడు; చాలా మంచివాడు, వస్తువుపోయిన సంగతి తెలిసింది అంటే, మరి జన్మజన్మాలకూ జ్ఞాపకం వుండేటట్లు సాధిస్తాడు అందువల్ల ఈ గొడుగు మరి నే తీసుకొని వెళ్ళకూడదని" - పాపం ఆయన అనుకొని, అక్కడికక్కడనుంచే గొడుగును మన ఇంటికి పంపించి వేద్దామనే ఉద్దేశంతో, మనిషి కోసం గాలించారట! "ఏంగయితే నేం - చివరకు అదృష్టవశాత్తూ, మీకోసం తిన్నగా వస్తూంటాడే పేపరు కుర్రాడు - ఆ కుర్రవాడి పేరు నాకు తెలియదు.."

"ఎవరూ? మొహాన మచ్చవుంటుంది అతడేనా?" - మధ్యలో సీతారామయ్య ప్రశ్న వేశాడు!

"ఉహూ! అతడు కాదు...నల్లగా వుండే కాపుల అబ్బాయ్"

"ఓహో అతడా? అతడిపేరు వెంకట్రాజు," అన్నాడు సీతారామయ్య

"ఆ..అతడే నండి. ఆ అబ్బాయికి గొడుగు ఇచ్చి మన ఇంట్లో ఇవ్వమని మా నాన్నగారు చెప్పారట. చివరకాయన రాజమండ్రం వెళ్ల నవసరమే లేకపోయిందట! 'సైకు షోను' దగ్గిరే ఆయన పని అయిపోయింది. ఆయన తిరిగి ఆ కుర్రాడికోసం

జతికారట కానీ కనపడలేదు. అందువల్ల ఆయన మా వూరు తిరిగి వెళ్ళిపోతూ, తమ అల్లుడుగారు ఎక్కడ ఖంగారుపడిపోతారో అని చెప్పి, పని కట్టుకు మన ఇంటికి వచ్చి - ఈ సంగతి చెప్పి మరీ వెళ్ళారు. ఇక చాలా - మీ గొడుగుకు వచ్చిన ప్రమాదం ఏమీ రాలేదు కనుక - మీరు ఈ రాత్రి సుఖంగా నిద్రపోవచ్చు - ఎటు వచ్చీ ఆ కుఱ్ఱవాడు, మన ఇంటికి రాలేదు కనుక, మీరే రేపు ప్రొద్దుట అతడ్ని కలుసుకొని - అవసరం అయితే గొడుగు తెచ్చుకోవలసి వుంటుంది" - అంది జానకి

సీతారామయ్య నవ్వుతూ "చివరకు, వెంకట్రాజు దగ్గరకు గొడుగు వెళ్ళిందన్న మాట? బ్రతికించావ్" - అన్నాడు

జానకి, "మరి భోజనానికి లేవండి అత్తయ్య ఎప్పుడో చెప్పారు ఈ గొడుగు గొడవలో ఆలస్యం అయింది"-అంటూంటే-

"చిత్తం" - అంటూ, బట్టలు మార్చి భోజనానికి లేచాడు సీతారామయ్య!

* * *

ఆ రాత్రి సీతారామయ్య తిన్నగా నిద్రపోలేదని వ్రాస్తే మీరు నవ్వుతారనుకుంటాను. కలత నిద్దుర మధ్యా, కలలమధ్యా సీతారామయ్య ఆ రాత్రి గడిపాడు.

మర్నాడు - ఎనిమిది గంటల వేళ అతగాడు కాలకృత్యాలు తీర్చుకొని, గొడుగు తెచ్చుకోవటంకోసం-స్టేషనుకు బయలుదేరాడు!

అయితే, సీతారామయ్యకు అవసరమైన వెంకట్రాజు ఉదయం తొమ్మిదిగంటలు దాటితేకానీ అక్కడకు రాలేడు. అనేక విధాలుగా ఆలోచిస్తూ, అతను ప్లాటుఫారం మీద తిరుగుతూండగా, దూరాన వెంకట్రాజు కన్పించాడు.

సీతారామయ్య పేదకు పెన్నిధి దొరికినట్లుగా సంతోషిస్తూ అతడ్ని కేక వేశాడు. ఎదురుగా వస్తున్న వెంకట్రాజు, అతడికేక విని, తెల్లబోయి, ముఖం చాటుచేసుకొని తప్పించుకు వెళ్ళిపోదామనుకొన్నాడు కానీ సీతారామయ్య ఒకటికి రెండు మార్లు కేకలు వేయటంతో - వెంకట్రాజు మరి కనిపించి, మాటాడటంతప్పదనుకుంటూ "ఏమండీ పంతులుగారూ?" అంటూ, వెలవెలబోయే ముఖంతో యెదురుగా వచ్చాడు.

"ఎన్ని కేకలు వేసినా పలకవేమోయ్?" సీతారామయ్య అడిగాడు

"వినపడలేదండీ," అబద్ధం ఆడ ప్రయత్నించాడతను

"ఈ మధ్య కొత్తగా చెముడు నీకు ప్రవేశించినట్లుంది,—" సీతారామయ్య నవ్వాడు!

"లేదండి"—వెంకట్రాజు ముఖం మరో మారు వెలవెలబోయింది

"మా మామగారు గొడుగునిచ్చింది నీకేనా"

"అవునండి"— సీతారామయ్య ముఖం చూడలేక, వెంకట్రాజు తలదించుకొన్నాడు!

"నువ్వు నిజంగా బ్రతికించావ్! ఆయన మతిమరుపు మనిషి బొత్తిగా ఆయనకు జ్ఞాపకశక్తి తక్కువ; ఎక్కడ పారేశారోనని— రాత్రినుంచి నాకు మనస్సు తిన్నగా లేదు"— సీతారామయ్య నవ్వాడు

వెంకట్రాజు కృంగిపోతూ అన్నాడు. మీ మామయ్యగారు మతిమరుపు మనిషి కారండి; నేనేనండి"

"అదేమిటి అలా అంటున్నావ్"— సీతారామయ్య ఆశ్చర్యపోయాడు

"ఏం చెప్పనండి! ఆ గొడుగు ఎక్కడో పోయింది—"

సీతారామయ్యకు మూర్ఛ వచ్చినంతపనయింది! "పోవటమే! అదేమిటి? ఆయన నీకివ్వలేదా అసలు?" ఏలాగో అతడా ప్రశ్నలను వేశాడు!

"ఆయన ఇచ్చారండి! అది నా చేతులతో నే పారేశానండి" వెంకట్రాజు తప్పు తనదే అన్నట్లుగా ఒప్పుకొన్నాడు!

"ఏలా పారేశావోయ్"— కసితీర— వెంకట్రాజు వయిపు చూశాడు సీతారామయ్య

"ఏం చెప్పనండీ?"— వెంకట్రాజు బిక్కముఖం పెట్టి, చెప్పటం సాగించాడు

"నాకొపని చెప్పింది మరెవరయినా అయితే నే అంగీకరించేవాడిని కాదండి; మీ మామయ్య గారిలాంటి పెద్దవారు గొడుగు—మీ ఇంట్లో ఇచ్చివేయమనటంవంటి చిన్న పని చెప్పినప్పుడు, ఏలా కాదనగలనండి?

"సరే"—అని వారి దగ్గర గొడుగు పుచ్చుకున్నానండి ఆయన ఇచ్చి వెళ్ళిపోయారు. ఆ తర్వాత "సైను డౌను" వచ్చింది అది వెళ్ళిపోటంతోటే, ఏలూరు నుంచి వచ్చిన నా స్నేహితుడు-రామారావనే వాడితో పత్రిక చందాలు వసూలు చేయటానికి బజారుకు బయలుదేరానండి నేను బయలుదేరేప్పుడు- గొడుగు నా చేతిలోనే వుందండి ఇద్దరం వంతెనవరకూ కలిసే వచ్చామండి; మధ్యలో వాడు-తన పనులు చూసుకొని, "మరి వాళ్ళ న్నరకోటికి టయిం అయిపోయిందం"టూ వెళ్ళిపోయాడండి నేను చందాలు వసూలు చేసుకొని, తిరిగి స్టేషనుకు వచ్చి - పేపర్ల జమాఖర్చులు చూసుకుంటూంటే-పుల్లయ్య అనే మా కుఱ్ఱాడొకడు — "పంతులు గారి గొడుగేది?-" అని అడిగాడండి! అంతవరకూ దాని సంగతే నాకు జ్ఞాపకం రాలేదండి. అది ఏమయిందో యేమిటో ఎంత యోచించినా, నాకు తెలియటంలేదండి-"

వెంకట్రాజు మాట్లాడటం మానేశాడు సీతారామయ్య - మనస్సులో యెంతగానో బాధపడుతూ "నేనేం చెప్పను? గొడుగును నే కొనలేక, కొనలేక కొన్నాను. ఈ మధ్యనే గొడుగుబాకీ పదిరూపాయలూ జమ చేయటం కూడా అయింది-" ఈలా గొడుగు కొనటంలో తనకున్న సాధక బాధకాలన్నీ అతడు వివరంగా చెప్పుకున్నాడు

వెంకట్రాజుకూడా బాధను వెలిబుచ్చుతూ "నేను మాత్రం ఎటువంటి హీనస్థితిలో వున్నానో మీకు మాత్రం తెలియదండీ? రాత్రింబవళ్ళు-ఈ పత్రికల దగ్గర తిరిగితే, నాకిచ్చే జీతం పాతిక రూపాయలు నాకింక ఇతర ఆదాయాలేమున్నాయండి? ఆ మొత్తంతోటే కుటుంబాన్ని నేను పోషించుకోవాలండి నిజానికా కొద్ది మొత్తంతో— జీవితయాత్ర సాగిస్తూండే నేను మీకు గొడుగును కొని ఇచ్చేస్థితిలో లేను! ఏమైనా—మీ గొడుగు నే చేతులారా పారేశాను! అది ఏమయిందో నాకు తెలియటం లేదుకనుక, అది పోయినట్టే! అందువల- నేనటువంటి గొడుగు నే మీకు తప్పక కొనియిస్తానండి, బీద వాడ్ని కనుక, కొద్దికాలం ఆలస్యమవుతుంది మరేం అనుకోకండి,"— అంటూంటే,—

వెంకట్రాజుమీద అభిమానం, నమ్మకం కల్గి వున్న సీతారామయ్య జాలిపొందాడు! నిజంగా అతను గొడుగు కొనియివ్వలేడు! అయితే "యివ్వలేడు పోనీలే"—అని, కొనలేక, కొన్న తన కష్టార్జితపు గొడుగును పోగొట్టుకో కలడా? నిజానికి- చెప్పుకుంటే గొడుగు పారేసింది వెంకట్రాజు కాదు— తన మామయ్య! ఆయన పోగొట్టవలసిన గొడుగును ఇంటిదగ్గర ఇవ్వటానికి వెంకట్రాజు, ఉపకారరీత్యా యివ్వ యిష్టపడితే, అది అతని పాలిట అపకారమైంది! చేత గొడుగు పుచ్చుకున్నంత మాత్రాన, బాధ్యత అతడిదవుతుందా? వెంకట్రాజును పదిరూపాయలు ఇమ్మనటంలో ఎంత న్యాయం వుంది?

ఏమయినా-తాను తన గొడుగుమీద కల్గి వున్నటువంటి హక్కును పోగొట్టుకోటం ఇష్టంలేదు

దీర్ఘకాలం యోచించిన అనంతరం సీతారామయ్య వంకట్రాజువంక చూసి "వెంకట్రాజూ? నే నిజం చెబుతున్నాను! ఈ పరిస్థితిలో ఏం చేయటానికి కానీ — ఏం అనటానికి గానీ నాకు తోచకుండా వుంది. నా చేతో తిరిగి నే గొడుగు కొనుక్కోలేను నువ్వుకూడా కొని ఇవ్వలేవు ప్రస్తుతస్థితిలో నిన్ను గొడుగును

# ★ దక్కిందిగొడుగు ★

కొని యివ్వమని అడగటంకూడా నాకు సబబుగా తోచటంలేదు. అందువల్ల కొద్ది కాలం ఆలస్యమవుతే అవుతుంది. ....నా గొడుగుజాడలు తియ్యి, ఆలస్యంఅయినా నా గొడుగు ఆకృతి నాకు వస్తేచాలు—" అన్నాడు!

ఈ మాటలు వెంకట్రాజుకు బ్రహ్మానందాన్ని కల్గించినాయ్ "ఆ. ఇంకేమండి! నాకు కొంచెం వ్యవధిఇవ్వండి మావాళ్ళనందరినీ అడిగి దాని ఆరాలుతీస్తాను అప్పటికీ లభ్యంకాకపోతే కొత్త గొడుగు కొనిస్తాను"—అన్నాడు . . .

'సరే'—అని తలవూపుతూండగా, అవుటరు సిగ్నలు సమీపించిన మేలు కూత కూసింది "బండి వస్తూందండి తిరిగి మిమ్మల్ని కలుసుకుంటాగా" — అంటూ వెంకట్రాజు — ప్లాటుఫారం ముందువయిపుకు పరుగెత్తాడు.

సీతారామయ్య 'ఉస్సు' రనుకుంటూ నెమ్మదిగా—అడుగులు వేస్తూ, స్టేషను బయటకు వచ్చాడు!

* * *

ఆతర్వాత పదిరోజులకు—

ఒక సాయంకాలం, కాఫీహోటలుదగ్గర, సీతారామయ్యకు, వెంకట్రాజు కనిపించాడు.

ఒక్కప్పుడు — చాటుగా ముఖం పెట్ట, తప్పించుకోన ప్రయత్నించిన వెంకట్రాజే ఎదురుగావచ్చి సంతోషాన్ని వ్యక్తపరుస్తూ "ఏమండోయ్ పంతులుగారూ? ఒక మంచి వార్త.. మీ గొడుగుపోలేదు. వుంది!"— అన్నాడు.

సీతారామయ్యకు చచ్చిపోయినవాడు—తిరిగి బ్రతికినప్పుడు వచ్చేటంత సంతోషం వచ్చింది అతడు ఆదుర్దాగా: "ఏదీ? ఎక్కడ?"—అని అడిగాడు!

వెంకట్రాజుకు నవ్వువచ్చింది "ఇక్కడ కాదండీ! మీ గొడుగు వున్నటుగా కబురు వచ్చింది నా స్నేహితుడు రామారావు అని చెప్పాను జ్ఞాపకంవుందాండీ? అతగాడు దాన్ని తనతో ఏలూరు తీసుకుపోయాట్ట! ఆవేళ మేం బజారుకుపోతూంటే దార్లో నా చేతిలో గొడుగు పుచ్చుకొన్నాట్ట అతడు నాకు తిరిగి యిచ్చింది లేదు పరాకుగా వెనక్కు తిరిగి వెళ్ళిపోయాట్ట. బండి ఎక్కినాక—వాడికి జ్ఞాపకంవచ్చిందట. ఏం చెయటానికీతోచక దాన్నికూడా తీసుకుపోయాడట మనవూరు వచ్చే పరిచయంవున్న వ్యక్తి ఎవరయినా కన్పడితే వాళ్ళకు దాన్ని యిద్దామని వాడు పదిరోజుల్నుంచి ప్రయత్నిస్తున్నాట్ట! చిట్టచివరికీ ప్రొద్దుట—అర్ధంతరంగా సేషనులో కన్పడి, ఈ వూరువస్తున్న మా స్నేహితుడిచేతి—గొడుగు ఆ సమయంలో దగ్గరలేకపోవటంవల్ల—వున్నట్లుగా నాతో చెప్పమని కబురుమాత్రం పంపించాడు.

సీతారామయ్యకు, తన గొడుగు, తనకు దక్కుతున్నందుకు ఎంతగానో ఆనందం కల్గింది. వెంకట్రాజులాంటి అమాయకుడ్ని యేమైనా చెడ్డగా భావించి, గతంలో కష్టంకలిగించే లాగ ఏమైనా మాటలన్నానేమోనని అతడు బాధపడ్డాడు కూడా!

"వెంకట్రాజూ! ఈ సందర్భంలో నేనిన్ను చాలా శ్రమపెట్టాను. నన్ను గురించి నువ్వు యేమాత్రం చెడ్డగా భావించకు సుమా. ." అని సీతారామయ్య అంటూంటే,—

"పంతులుగారు ఎంత మాటన్నారు"—అంటూ అతడు నొచ్చుకున్నాడు!

"అయితే ఏలూరులో వున్న మన గొడుగు ఎంతకాలంలో మనకు చేరుతుందంటావ్?"—సీతారామయ్య ప్రశ్నించాడు.

వెంకట్రాజు కొంచెం నిదానించి అన్నాడు, "మేం పేపర్లుఅమ్ముకుంటూ—ఏలూరు—దాకా తరుచు వెడుతూంటాం కాదండి . ఈ పట్టు మరచిపోకుండా దిగి—మా వాళ్ళయింటికి వెళ్ళి మీ గొడుగు తెచ్చిపెడతాను"

'ఎన్ని రోజులలో?"—అనుమాన నివృత్తి కోసం అడిగాడు సీతారామయ్య!"

"ఏం చెప్పనండి? నే వీలును బట్టి వెడుతూంటాను. సుమారు పదిరోజులనుకోండి"

"సరే...ఆ పది రోజుల్లోగా నా గొడుగు నాకు చేర్చు"

"అలాగేనండి"

ఈలోగా శరభశాస్త్రి అనే, సీతారామయ్య స్నేహితు డక్కడికి వచ్చి, "అలా పైకి వెళ్ళొద్దాం రావోయ్"—అంటూ, అతగాడ్ని బలవంతాన లాక్కుపోయాడు! "వస్తాను మరచిపోకు"—అంటూ సీతారామయ్య అతడి వెంట నడిచాడు!

* * *

ఇప్పటికే పెద్దదయినా ఈ కథను మరింత పొడిగించటం వుచితం కాదు .

ఏలూరునుంచి గొడుగు పదిరోజుల్లో తప్పకుండా తెచ్చి యివ్వగలనన్న వెంకట్రాజు-అన్నమాట ప్రకారం కంటె ముందుగా-అంటే వారం రోజులకే, ఒక గొడుగు చేత పుచ్చుకొని, సీతారామయ్యకు దాన్ని యిచ్చే తలంపుతో అతడు పనిచేసే ఆఫీసు దగ్గరకు వచ్చాడు!

అప్పటికి మధ్యాహ్నం మూడు గంటలయివుంటుంది. అర్జంటు రిఫరెన్సు పరిశీలన చేస్తున్న సీతారామయ్యకు "పంతులుగారూ"—అని వెంకట్రాజు గుమ్మం బయటనుంచి కేక వేయటంతోటే దృష్టి అటువైపుకు నడిచింది! అతడు లోపలకు వచ్చాడు. వెంకట్రాజును మాడ్డంతోటే-సీతారామయ్య వదనంవికసించింది..."ఏమోయ్ గొడుగు దక్కిందా?"—చేతులో వున్న అర్జంటు కాగితాన్ని ఆలా

(43 వ పేజీ చూడండి)


## పూవు మీ అదృష్టం చెప్పగలదు



నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్ని, నీ సరియైన చర్య గురించిన్ని నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టు కార్డు పైన నీ కిష్టమగు ఒక పుష్పము పేరున్ను, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్ను, నీసరియైన చిరునామాయున్ను వెంటనే వ్రాసిపంపుము

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డు వ్రాసిన తేది లగాయతు 12 మాసములలోను నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో నీకు జయముకలుగును నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభం మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారిగా వ్రాసి రు 1-4-0 లకు మాత్రము వి పి గా పంపగలము (వి పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవైనా వున్నయెడల శాంతి చేయు విధానం కూడా తెలుపుడు చేయడమగును వివరములు మా పూచీపైని పంపబడును. మేము పంపిన భోగటా నీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి

Shree Swami Satyanarain, Raj Jyotishi, (WP A) Phagwara (Pb)

## ★ ఆడబడుచులా-ఆడంబరాలు ★

(26 వ పేజీ తరువాయి)

టుండవే ఆలోచనలో పడి, ఊహించుకో లేక సతమత మవుతున్నాడు.

* * *

సాయంత్రం అయిదయేసరికి నలుగురు కోడళ్లూ ముగ్గురు కూతుళ్లూ, మంగాయమ్మ కొత్త గుడ్డలతో ముస్తాబై కూర్చున్నారు. పెద్ద కొడుకు నాగేశ్వరరావు భార్యను ఇవతలకు పిల్చి ఏవో గుసగుసలు చెప్పాడు. భార్య చింపిరిచేటంత ముఖం చేసుకుని దొడ్డి వాకిలిగుండా మళ్లీ హాల్లోకి వచ్చి కూర్చుంది. నాగేశ్వరరావు తల్లి దగ్గరకువచ్చి "అమ్మా! లక్ష్మీపతి గారింటికి వెళ్లొస్తామే! ఆయన్ని చూసి చాలా రోజులయింది" అన్నాడు.

"దానికేం లక్షణంగా వెళ్ళరండి!" అన్నది తల్లి. మరుక్షణంలో నాగేశ్వరరావూ, కాంతమ్మ ఇద్దరూ ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ రోడ్డుమీద నడుస్తున్నారు.

వాళ్లిద్దరు వెళ్లిపోంగానే మూడో కొడుకు, ఆ తర్వాత నాలుగోవాడు పెద్ద సోదరుని అడుగుజాడల్లో ప్రవర్తించి బయటకు జారుకున్నారు. వీళ్లంతా పోవటం చూసి రాజమ్మ భర్తను ప్రక్కకు పిలిచి "ఏమండీ! ఏదన్నా సినిమాకు వెళ్దామండీ!" అన్నది భర్త మరేదో చెప్పాడు చిఱునవ్వుతో. "సరేలెండి!" అంటూ సిగ్గుతో తలవంచుకుని లోపలికొచ్చి కూర్చుంది యధాస్థానంలో.

"ఇదిగో! జన్మకో శివరాత్రని అందరం ఇవాళ సినిమాకు వెళ్దాం!" అన్నాడు పరంధామయ్య పరుపుమీదనుండి లేచి ఆవలిస్తూ.

"మరి ఇంట్లో ఎవరుంటారు?" అనడిగింది మంగాయమ్మ. "అయితే ముందు ఎవరెవరు సినిమాకు వస్తారో చెప్పండి?" అనడిగాడు పరంధామయ్య.

"గృహప్రవేశం రోజు గనక ఇల్లు తాళం వేసి పోవటానికి వీల్లేదు ఇంట్లో ఎవరన్నా ఉంటే నేను రెడీ!" అన్నది మంగాయమ్మ.

"మేమూ వస్తాం!" అన్నారు కూతుళ్ళు ముగ్గురూ! రెండో కొడుకు కాంతారావు, కోడలు రాజమ్మ ఏం మాట్లాడలేదు.

"ఏరా కాంతం? మీరు ఊకొట్టలేదేం?" అన్నాడు పరంధామయ్య.

"నాకు రెండు రాత్రులనుంచి నిదరలేదు నేను రాను! అన్నాడు కాంతారావు. "నాకు తలనొప్పిగా ఉంది నేను రాలేను!" అన్నది రాజమ్మ.

* * *

పర్యవసానంగా జరిగిన గమ్మత్తేమంటే ఒకళ్ళకు తెలియకుండా ఒకళ్ళు పరంధామయ్యగారి కుటుంబం అంతా రెండో కొడుకు, కోడలు తప్ప-ఒకే హాలులో ఒకే కుర్చీ వరుసలో చేరారు. పరంధామయ్య కొడుకులు చేసినపనికి లోలోపల నవ్వుకున్నాడు. ముగ్గురు కూతుళ్లూ అన్నల్ని దెప్పిపొడిచారు కొడుకులూ, కోడళ్ళ ముఖాల్లో కత్తివాటేసినా నెత్తురు చుక్క లేదు. మంగాయమ్మ ఈవిషయా లన్నింటినీ గమనించీగూడ చూడనట్టు ఊరుకుంది

కాంతారావు, రాజమ్మ ఇద్దరూ భోజనం చేసుకుని మనదే రాజ్యం అన్నట్టు ఇల్లంతా ఒకసారి తిరిగి, తలుపులు జాగ్రత్తగా బిడాయించి పడకగది చేరుకున్నారు.

పరుపుమీదకు మేను వాలుస్తూనే ఒక్కసారి గట్టిగా ఆవలించాడు కాంతారావు.

"అప్పుడే నిద్రొస్తున్నదండీ!" అన్నది రాజమ్మ తమలపాకుల చిలకలు నోటి కందిస్తూ.

"నిద్రొస్తే యేం నీ కెందుకు? నీకు తలనొప్పి వచ్చిందన్నావుగా!" అన్నాడు కాంతారావు నవ్వుతూ.

"మామగారు మాత్రం సామాన్యులాయేం? సినిమాకు వెళ్తూ వెళ్తూ తలనొప్పిని వంక నేసుకెళ్ళారు. కాస్త కూస్త మిగిలి ఉన్న దొంగ తలనొప్పికాస్తా దాని దారిన అది పోయింది." అన్నది రాజమ్మ. ★

## ★ దక్కింది గొడుగు ★

(34 వ పేజీ తరువాయి)

బులు మీద వదలి, అతడి చేతిలో వున్న గొడుగువంక చూస్తూ అడిగాడతను!

"దక్కిందండి కానీ యీ సందర్భంలో మీరు నన్ను క్షమించాలి" వెంకట్రాజు ముందుగానే క్షమాపణాస్త్రాన్ని సీతారామయ్యమీద పడేశాడు!

"దక్కిందిగా... మరికనేం ..." సీతారామయ్య అదోవిధంగా వెంకట్రాజువైపు చూశాడు!

"నిజంగానే మీరు నన్ను క్షమించాలండి. మీ గొడుగు అందమైన ప్లాస్టిక్ కామతో మొదటిరకం నల్ల సిల్కు గుడ్డతో-కట్టుదిట్టమైన పూచలతో చాలా అందంగా వుండే దండి. కాని నా చేతికి యిది దక్కిందండి" వెంకట్రాజు, కళ్ళనీళ్లు పెట్టుకొని, గొడుగు విప్పి చూపించాడు.

ఆ గొడుగు ప్లాస్టికుపిడి ఎప్పుడో విరిగి పోయింది! గుడ్డ మొదటిరకందే అయినా అంతా తూట్లుపడిపోయింది; ఊచలు తుప్పు పట్టాయి! "ఇదేమిటి? ఇది నాదికాదు నాకేం అర్థంకావటంలేదు" సీతారామయ్య తెల్లబోతూ అడిగాడు.

"ఏం చెప్పేదండీ?" కళ్ళు తుడుచుకొని, వెంకట్రాజు చెప్పటం సాగించాడు! "మీతో చెప్పినట్లుగా గొడుగు తెద్దామని నిన్న ఏలూరు పనికట్టుకువెళ్ళి, వాళ్లింటికి చేరుకొన్నానండి. యోగక్షేమాల తరువాత మా రామారావు ఏమిటేమిటో చెప్పి యీ గొడుగు తెచ్చియిచ్చి: "మరేం అనుకోకు! నాలురోజులక్రితం-వర్షంలో నీ గొడుగు వేసుకొని కాఫీకి వసంతమహల్ అనే హోటలుకు వెళ్లాను. గొడుగు-అన్నిటితో పాటూ బయటవుంచి లోపలికెళ్ళాను. కాఫీ త్రాగి, తిరిగి వచ్చిచూస్తే ఆ గొడుగు గల్లంతు! ఏంచేసేది-అక్కడవున్న వాటిల్లోకి బాగున్నదీ, ఆ గొడుగు పోలికలున్నదీ-ఒకటి తీసుకొని మాటాడకుండా బయటకు వచ్చేశాను! మీ గొడుగుకు బదులు యిది నాకు దక్కింది ... అతలాయన ... ఏదో గొడుగు యివ్వమన్నాడని-యింతక్రితం అన్నాడుగా! ఆయన చేతిలో యీ గొడుగు వుంచి జరిగినదంతా చెప్పు" అన్నాడండి. బంగారంవంటి-మీ గొడుగుకి బదులుగా యిది దక్కిందండి..."పది రూపాయల కిమ్మతుచేసే బంగారంవంటి గొడుగును నువ్వు పారవేస్తే, ఆయన్ను నే యేలా సమాధాన పరచగలను" అని బాధపడుతూ అంటూంటే చీమయినా కుట్టనట్టుగా వాడు: "పోనీ... మా యింట్లో ఎలుకలు యెక్కువగా వుండటం వల్ల గొడుగు తూట్లుపడిందనీ, ఈ మధ్య వానలు ఎక్కువగా కురుస్తున్నందువల్ల ఊచలు తుప్పుపట్టాయని, పిల్లల మూలకంగా కామ విరిగిపోయిందనీ చెప్పు" మన్నాడండి. "కొత్తప్లాస్టికు కామ వేయించుకొని, కొత్త పూచలు పెట్టించి-కొత్త నల్ల సిల్కు గుడ్డ వేయిస్తే-అది సరికొత్తగొడుగు అయిపోతుందని, సలహాకూడా యిచ్చాడండీ"...పారవేసినవాడు ఆ విధంగా మర్యాదలేకుండా మాటాడితే నే నేం చేసేదండి?..

ఈ మాటలని, వెంకట్రాజు తలదించుకొన్నాడు. సీతారామయ్య, తన్ను తాను ఎలాగో సమాధానపరచుకొన ప్రయత్నిస్తూ: "పోనీలే...ఏదో గొడుగు దక్కింది! అంతే" అని నోటిచివరనుంచి అన్నాడు!

"బ్రతికించారు" అన్నాడు వెంకట్రాజు ఎంతో ఆనందం పొందుతూ. ★